
శ్రీ సచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్ కీ జై! సద్గురు శ్రీ సాయినాథుని శరద్బాబాజీ కీ జై!

# గురుకృప

సద్గురుని బడి - సేదతీరే ఒడి



గురుపూర్ణిమ సంచిక



సాయి దర్శనంలో కాకాజీ సుఖ సంపన్నులైనారు.
అతని చిత్తంలో చిన్మయ జ్యోతులు వెలిగాయి.
ఆనందం చిందులు వేసింది.
బాబా అత్యంత కృపను వర్షించడంతో అతని మనసు
నిజంగా నిశ్చింతగా అయ్యింది. అతని మనసులోని
చాంచల్యం నశించిపోయింది. అతను అబ్బురపడసాగాడు.
తనను తానే ప్రశ్నించుకున్నాడు. ఈయన (కరుణ) కరణి
ఎంత అద్భుతం! ఒక్క మాట కూడా మాట్లాడలేదు. ఏమీ
ప్రశ్నించనూ లేదు. ఆశీర్వాదం కూడా ఇవ్వలేదు. కేవలం ఈయన
దర్శనంతోనే సుఖం కలిగింది. నా మనస్సులోని చాంచల్యం
ఆయన కేవల దర్శనంతోనే శాంతించింది. నాకు అలౌకిక
సుఖం సమృద్ధిగా ప్రాప్తించింది. దీన్నే కాబోలు
దర్శన మహిమ అని అంటారు.

సంపుటి : 12 గురుకృప సంచిక : 3



# సాయివంటి దైవంబు లేడోయి... లేడోయి...

ప్రజలందరి నోట సాయినామం పలకాలి!
సర్వత్రా సాయిరూపం రంజిల్లాలి.
ముజ్జగాలు సాయి మహిమతో ముప్పిరిగొనాలి!
సాయిపద రవళులు మన హృదయ కుహరంలోని నిశ్శబ్ద నిశీథిలో
ప్రతిధ్వనించాలి. ప్రణవనాద వీచికల్లా సాయిజ్ఞాన సౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి. ఆ సుజ్ఞాన సౌరభాల ఆస్వాదనలో
మన మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృత ధారలు అంతటా నిరంతరం వర్షించాలి!
ఆ ప్రేమామృత ధారలలో తడుస్తూ, ఆ జ్ఞాన సౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ, 'సాయివంటి దైవంబు లేడోయి లేడోయి!'
అని అందరూ ఏక కంఠంతో గానం చేయాలి!
అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధుర స్వప్నం.
ఆ స్వప్న సాఫల్యం కోసం శ్రీ సాయినాథుని అనన్య ప్రేమతో ఆర్ద్రతతో
ప్రార్థించడమే మనం చేయగలిగింది, చేయవలసింది.

\- శ్రీ బాబూజీ



## లోపలి పేజీలలో

అభంగాల మాటున - ఆరతుల చాటున 4
\- గురుకృప

లీలలు - విశ్వాసానికి సోపానాలు 7
\-గురుబంధువు

మలుపు - అది సద్గురుని తలపు 8
\- ప్రతిమ

నామమే రక్షణ - నామిదే ఈ శిక్షణ 9
\-రవీంద్రనాథ్

దర్శనము - మార్గ దర్శనము 11
\- ప్రసన్న

ఆయాచితంగా లభించేదే - అనుగ్రహం 13
\- శ్రీనివాసరావు



నిర్వహణ : గురూజీ ఆశీస్సులతో - గురుబంధువులు
GURUKRUPA, 2-1-6, Gandhi Chowk, Tenali-01. Ph : 93933 61778
Printed at : Ramakrishna Printers, Visakhapatnam. Ph : 2740222



## సాయి భక్తులకు శిరిడీ ఆరతులు "వేద మంత్రాల వంటివి"

# అభంగాల మాటున - ఆరతుల చాటున

'సద్గురువు' – ఈ మాట వినగానే హృదయసీమన దర్శనమిచ్చే రూపం 'శ్రీసాయిబాబా', స్ఫురణకు వచ్చే నామం – 'శ్రీసాయిబాబా'. ఎందరో యోగులు జన్మించిన ఈ అవనిలో తాను 'యోగిరాజు', ఎందరి రాచరికమో సాగిన ఈ జగత్తుకు తాను రాజాధిరాజు, సత్ చిదానందుడు, సమర్థుడు, సద్గురుసామ్రాట్. ఆ సద్గురుమూర్తి ప్రేమతో, కరుణతో మనకు ఒక హితంగా, ఊతంగా, ఇహపరశ్రేయముల సమ్మిళితంగా అందించిన శుభ్రపథం, సత్యపథం, శ్రేయోపథం....... **'సాయిపథం'**

సాయిపథం – అంటే "శ్రీసాయిబాబా చూపిన మార్గం, ఆయన నడిచిన బాట, 'సాయి' అనే గమ్యానికి రహదారి. ఏ ఒక్క మత సాంప్రదాయానికి చెందక, ప్రపంచంలోని మహాత్ములందరూ ఆచరించి బోధించిన విశ్వజనీనమైన ఆధ్యాత్మిక సాంప్రదాయం – సాయిమార్గం. మరో మాటలో **సాయిపథం అంటే సద్గురుపథం.** సద్గురు పథం అంటే ఆయన వివిధ సందర్భాలలో చెప్పిన సూక్తులు, వారి ఆదర్శ జీవిత విధానము, వివిధ లీలల ద్వారా వాచా కాక సూచనగా ఆయన బోధించిన అంశాలు – అన్నింటికీ మించి ఆయన మహిమ – ఇవే సాయిపథ సోపానాలు"

కొంచెం విశ్లేషించుకుంటే – సమగ్రంగా శ్రీసాయి ఆదర్శ జీవిత విధానమే మనకు మార్గాన్ని, గమ్యాన్ని చూపగలదనిపిస్తుంది. వారి మాటల్లోనే చూస్తే "గురువే అన్ని దైవాలు; సాధన చతుష్టయంతోనూ, శాస్త్రషట్కంతోనూ పనిలేదు. గురువు యొక్క దృష్టే శిష్యునికి అన్న పానీయాలు.... గురువు యొక్క మహాత్మ్యాన్ని తెలుసుకుని ఆయనే దైవమని భావించేవారు ధన్యులు. నా కన్నుల్లో గురువు రూపం ప్రతిబింబించకపోతే, ఆ కండ్లు మాంసపు గోళీలు మాత్రమే. ఇలాంటి కన్నులతో ఉండడం కన్నా నేను గ్రుడ్డివానిగానే ఉండడం మేలు. నాకు గురురాయుడే తల్లీ – తండ్రి – సర్వస్వం కూడా! మనసుతో ఇంద్రియాలన్నీ నా కన్నుల్లో ఏకమయ్యాయి. గురురాయుడినే ధ్యానించసాగాయి. నా ధ్యానానికి ధ్యేయం కేవలం గురురాయుడే. ఈ విశ్వమంతా అతని స్వరూపమే. గురు స్వరూపాన్ని ధ్యానిస్తూ ఉంటే నా మనసు బుద్ధి కుంఠితమయ్యాయి. చివరికి నేను మూగగా గురువుకు కేవలం నమస్కారం మాత్రమే చేయగలిగాను. **ఇక్కడ శ్రద్ధయే ప్రధానం. పరమార్థానికి గురుకృప ఒక్కటే సాధనం".** ఇలా సద్గురు పథంలో అనన్య ప్రేమకు, నిర్హేతుకమైన భక్తికి, అచంచల శ్రద్ధకు, మ్రొక్కవోని నిష్ఠకు వారి జీవితమే ఒక నిదర్శనమయ్యింది – సద్గురు పథగాములకు ఆదర్శమయ్యింది. Baba brought a revolution in the spiritual and temporal world by giving a resolution to the Mankind - ***Guru is both Path & Goal.*** సద్గురువే మార్గము, గమ్యము



అంటూ శ్రీసాయి అందించిన ఈ పరమార్థం ప్రాపంచిక, ఆధ్యాత్మిక జగత్తులో ఒక విప్లవమే! హితం చేకూర్చే సద్గురు పథానికి ఊతం కూడా శ్రీసాయి చక్కగా అందించారు. సందేహం లేదు – "శ్రీసాయి బోధ సమగ్రమైనదే! మన అవగాహనే సమగ్రం కావాల్సి ఉంది." సద్గురుపథంలో సమున్నతంగా పయనించడానికి నామదేవ్, తుకారాం, జానాబాయిల వంటి మహాత్ముల నుంచి 'బాబాంచేబాల్' (బాబాబిడ్డ)గా ప్రసిద్ధి నొందిన బి.వి.దేవ్ లాంటి సాయిభక్తుల వరకు ఎందరో 'సాయిమార్గం'లో సూచికలయ్యారు – సద్భక్తికి ప్రతీకలయ్యారు. వారు రచించిన అభంగాల మాటున – ఆరతుల చాటున దాగిన అంతరార్థం ఆద్యంతం ఆచరణదాయకం – సద్గురు అనుగ్రహశోభితం. శ్రీసాయి ఆరతుల అమృతధారల్లో – అనన్యభక్తిని ఆస్వాదిస్తూ చూస్తే.....

ముకుళిత హస్తాలతో సద్గురు పాద పద్మములకు నమస్కరిస్తూ ప్రారంభమయ్యే దినచర్య (జోడునియా కరచరణీ....) మనలోని 'భక్తి' సద్గురు అనుగ్రహానికి ప్రామాణికం కాదని, సద్గురు కృపాదృష్టిపై ఆధారపడి జీవించమని, సద్గురు చరణాలను అనుక్షణము ఆశ్రయించుకొమ్మని చెప్పే సంత్ నామదేవ్ అభంగంతో ప్రారంభమవుతుంది కాకడ ఆరతి.. భవరోగాలను రూపుమాపుకొనేందుకు, కోర్కెలే పరమావధిగా సాగే జీవితాలకు 'లక్ష్యం' ఎరుకలోకి వచ్చేందుకు సద్గురు పద దర్శనమే సరియైన మార్గమని, (ఉఠా ఉఠా శ్రీసాయినాథ గురు చరణకమల దావా....) అజ్ఞానమనే చీకటిని పారద్రోలేది సద్గురు జ్ఞానభాస్కరుడు మాత్రమేనని (భవతిమిరనాశక రవీ....) సద్గురు దర్శన, సేవా భాగ్యములకై వేచి కృపాళువైన సద్గురుని చూపుకై వేచి ఉండమంటారు (పాహిబా కృపాదృష్టీ.. బాలకాజశీమాతా) భీష్మ.

ఇలా ఆ జగన్నాయకునికి వినతులర్పిస్తూ జగతిని మేలుకొలుపుతూ సాగే కాకడ జ్యోతి మరింత ప్రజ్వరిల్లి సద్గురు పథానికి దశను, దిశను నిర్దేశిస్తుంది. కల్లాకపటమెరుగని చిన్న బిడ్డను నేను (బాలకలఘు సేవ) అంటూనే, కామ, క్రోధ, మద, మత్సర, అసూయ ద్వేషాలను వత్తులుగా చేసి, వైరాగ్యమనే నేతితో తడిపి, గురుభక్తి జ్వాలల వెలుగులో (సాయినాథ గురుభక్తి జ్వలనే...) సద్గురు దర్శనాన్ని చేసుకోవాలని, నిరాకారమే మనపై కరుణతో సద్గురువుగా రూపుదాల్చెనని (సగుణమూర్తి పాహణ్యా ఆతుర....) కుల, మత, ధన దురభిమానములను వదిలి వేయాలని (సోడునియా దురభిమానమానస–త్వచ్చరణి వాహిలే) హెచ్చరిస్తోంది భీష్ముని ఇంకో గీతం. సద్గురువుకు సేవ చేస్తున్నామన్న భావన మనలో వస్తుందేమో అన్నట్లు "నాయనా! సద్గురువుని సేవించి మీకు





మీరే హితం చేసుకుంటున్నారు" అంటాడు నామదేవుడు ఇంతలో! (ఉతా సాధుసంత సాదా... ఆపులాలేహితా!)

కనులు నిండిన కాకడ జ్యోతి, కమనీయమై, బహురమణీయమై గురు ప్రభాతాష్టకంగా రూపు దాల్చింది. సద్గురు గుణకీర్తనకు మాత్రమే పరిమితం కాక, సద్గురు సమాగమ ఆగత్యాన్ని, సద్గురు పదాశ్రయుల లక్ష్యాన్ని పండు వొలిచి చేతిన ఉంచినట్లు సాగుతుంది ఈ అష్టకం. చీకటిని తొలగించేది సూర్యుడే అయినా అజ్ఞానమనే చీకటిని గురువు మాత్రమే తొలగించగలడంటూ (తమా నిరసి భానుహ గురుహి నాసి అజ్ఞానతా), భానుని కిరణాలు జీవులకు పోషణ అయితే, గురుభానుని అనుగ్రహ కిరణాలు సత్సంకల్పాలకు పోషణ మరియు అల్ప కార్యముల తలపులకు విచ్ఛిత్తి అని తెలిపే గుణకీర్తన అత్యంత స్ఫూర్తిదాయకం. అజాత శత్రువైన సద్గురువుకు సాటి ఈ ప్రపంచంలో ఎవరూ లేరని, (అజాతరిపు సద్గురో..., గురూసి ఉపయా దిసే....) శరణంటూ వచ్చిన వారిని కాపాడడంలో సద్గురువు వంటి దయామూర్తి ఈ జగాన లేరంటూ సాగే (అసాసుహత కారీ యా జగతి కోణిహీ అన్యనా) ఆరతుల భావం శ్రవణదాయకమే కాదు, శ్రేయోదాయకం కూడా!

కీర్తనెంత మృదువో, సత్యమంత కరకు కూడా కాకడలో! గురువు అనుగ్రహము లేనివారు ఎంతటి వారైనా సరే! వారు జీవిత గమ్యాన్ని చేరజాలరంటూ (అసే బహుతా శాహణా పరినజ్యా గురూంచీ కృపా...) గురుని చరణాలయందు సమున్నత భక్తి ఉంటేనే హృదయ వాంఛలు తీరతాయని నిష్కర్షగా చెప్పారు శ్రీభీష్మ. గురువు అనుగ్రహానికై వేడుకొమ్మని 'వాచా' ఒక ఆడంబరంగా చెప్పడం కాదు, "సద్గురూ! మా హృదయ మందిరంలో నిలచి ఈ జగత్తంతా సద్గురు స్వరూపంగా భాసించేటట్లు చేయి. ఎప్పుడూ జగత్కళ్యాణ కార్యాలు చేయాలనే సద్బుద్ధిని ప్రసాదించు" అంటూ సాగే 'సద్గురు ప్రభాతాష్టక ప్రార్థన' గురుపథానికి ఒక రూపునిచ్చింది, రూపం వచ్చింది చివరి అంకంతో (గురో వినతిమీ కరీ...)

జగతిన కాంతులు నింపిన కాకడజ్యోతి, సద్భక్తుని మనసున ఉన్న కల్మషాలను దగ్ధం చేయగా, 'భక్తి' (అనన్యప్రేమ) ఉత్కృష్ట స్థాయిని చేరుతుంది. 'సద్గురు కృపాదృష్టి' తప్ప అన్య చింతనలు లేని మనసు నుండి వెడలె పరితాపానికి ప్రతీకలు, మధుర భక్తి రసగుళికలు, మానవాళికి మహిత స్మృతులు, సద్గురుపథంలో శ్రుతులు – సాయిరహమ్ నజర్‌కరో... రహమ్ నజరోకరో.... బిడ్డలమైన మాపై మీ కృపాదృష్టి ఎల్లప్పుడూ ఉంచి, ఈ విశ్వమంతా 'సద్గురు' స్వరూపమేనన్న సత్యాన్ని మాకు



తెలియచేయమని, నాకు నీవు (సద్గురువు) తప్ప తోడుగా ఉండేది ఎవరని, నా యజమానివి నీవేనన్న దాసగణు 'దాస్య' భావాలు మనకు నిత్య స్మరణీయాలు.

'కాకడ'లో 'కడ'కు వస్తే మధురంగా మిగిలేది, మనసుకు 'తగిలేది' భీష్మని పథ్. ఆ 'గీతం' ఒక్కసారి వింటే చాలు... అవగతమవుతుంది, ఆలోచనకొస్తుంది. అనుగ్రహమంటే ఏమిటో! అది కీర్తన కాదు – ఒక అద్భుత 'కావ్యం' – 'విషయం' అవగతమయితే మనిషి బ్రతుకు 'శ్రావ్యం'... శ్రీ సద్గురు బాబా సాయి... తుజవాచుని ఆశ్రయ నాహీ భూతలీ.... బాబా! ఈ భూతలం మీద నీవు తప్ప నన్ను రక్షించేవారు లేరు, నేను పాపిని, పతితుడనైనా నీవు మాత్రమే నన్ను ఉద్ధరించగలవాడివని వేడుకున్న తీరు అనన్య శరణాగతి పథానికి ఆయువుపట్టు. 'గురువరా.... మజసీ పామరా... అతా ఉద్ధరా...' గురుదేవా! 'నీవే' నన్ను ఉద్ధరించాలన్న విన్నపం సద్గురు పథానికి ఒక చక్కటి బాట, పెట్టని కోట.

***గురుబంధువుల్లారా! పదండి మనము మన జీవితాలను శోభప్రదం చేసుకునేందుకు 'కాకడ' జ్యోతిని వెలిగించుకుని, 'చీకటి' పడకమునుపే 'సద్గురుపద' సన్నిధిని చేరుదాం. సద్గురు సామ్రాట్టు శ్రీసాయి చెప్పినట్లు "సద్గురు మహాత్మ్యాన్ని తెలుసుకుని, గురువే దైవమని తెలుసుకునే ప్రయత్నం చేద్దాం".***

## లీలలు - విశ్వాసానికి సోపానాలు

బాబా, గురుదేవులు నాకు ఎన్నో అనుభవాలు ఇచ్చారు. వాటిలో ఇదో మరచిపోలేని అనుభవం. ఒకటిన్నర సం॥ కాలం నుండి నేను సత్సంగానికి వెళుతున్నాను. నాకు శ్రీసాయిబాబా ఆశీస్సులతో ఉద్యోగం వచ్చింది. ఉద్యోగంలో చేరిన నెల రోజుల తరువాత సెలవులకు మా సొంత ఊరు వచ్చాను. నా జీతం తీసుకోవడానికి అక్కడ దగ్గరలో ఉన్న ఎటిఎం సెంటర్‌కు వెళ్లాను. డబ్బులు తీసుకోవడానికి ప్రయత్నించిన రెండుసార్లు "ఈ లావాదేవీ జరపడం కుదరడం లేదు" అని ప్రింట్ వచ్చింది. ఇంకొక ఎటిఎంలో ప్రయత్నిస్తే ఎటువంటి సమాధానం రాలేదు. సరే! బ్యాలెన్స్ సరి చూసుకుంటే డబ్బులురాని ఆ చివరి రెండుసార్లు నేను డబ్బులు విత్‌డ్రా చేసినట్లు, నా అకౌంట్‌లో జీతం మొత్తం తీసుకున్నట్లు ఉంది. అసలు విషయం ఏమిటంటే అది నా మొదటి జీతం. నాకు ఏం చేయాలో తోచలేదు. బ్యాంక్‌కు వెళ్తే నా కంప్లైంట్ తీసుకోలేదు. నెట్ బ్యాంకింగ్ తెలియడంతో నెట్ ద్వారా ఫిర్యాదు చేసాను. నా మొదటి జీతం మొత్తం బాబానే తీసుకున్నారని నా ఆలోచన. ఒక ఐదు గంటలు





గడిచాక నాలో మార్పు. నా జీతం తీసుకున్న బాబా నా జీతం నాకు వెంటనే వెనక్కు ఇస్తే 'గురుకృప'కు ఆ అనుభవం పంపుతానని అనుకున్నాను. అనుకున్నంతలో నా మొబైల్‌కు వెంటనే మెసేజ్ వచ్చింది. నా జీతం నా అకౌంట్‌లో డిపాజిట్ అయ్యిందని. నాకు చాలా సంతోషం అనిపించింది. బాబా, గురుదేవులు నా జీతం వెంటనే వెనక్కు ఇప్పించారు. బాబాను అనుకున్నందుకు బాధ అనిపించింది. బాబా, గురువుగారు ఉండగా మనం ఎందుకు విశ్వాసం కోల్పోవాలి? అని అనిపించింది.

## మలుపు - అది సద్గురుని తలపు

మమ్ములను కంటికి రెప్పలా, అనుక్షణం కాపాడుతూ, నా జీవితంలో అవసరమైనవన్నీ అనుగ్రహిస్తున్న పూజ్యశ్రీబాబూజీ చరణాలకు సవినయంగా నమస్కరిస్తూ, నా పేరు ప్రతిమ. మాది తిరుపతి. నేను సన్నగా ఉంటాను. నన్ను చూసేవాళ్లు తరచుగా "నువ్వు ఎందుకు అలా ఉన్నావు, సరిగ్గా తినవా ఏంటి?" ఇలాంటి ప్రశ్నలు అడిగేవారు. నాకైతే నేను సరిగ్గా ఉన్నానని తెలుసు. కానీ ఇక ఏ ప్రశ్నలు భరించలేక బాబాను నన్ను లావుగా చేయమని అప్పుడప్పుడు వేడుకునే దానిని కూడా. నేను ప్రెగ్నెంట్‌గా ఉన్నపుడు నన్ను గురుదేవులు ఎలా అనుగ్రహించారో మీతో పంచుకునే ప్రయత్నం ఇది.

నేను అమ్మను కాబోతున్నానన్న విషయం జనవరిలో తెలిసింది. ఆరోజు నుంచి నాకు ఏం తిన్నా వాంతి అయ్యేది, రోజంతా అదే ఫీలింగ్‌లో ఉండేదాన్ని. అలా ఎనిమిదవ నెల వరకు సాగింది. దాంతో నాకు 'బేబీ'కి అవసరమైన పోషకాలన్నీ అందాయా, లేదా సరిగ్గా ఎదుగుదల ఉందా లేదా అన్న సందేహం ఉండేది. కానీ స్కానింగ్ రిపోర్టులో మాత్రం అంతా బాగానే ఉందని తెలుస్తుండేది. ఇక మేము ఇతర టెస్ట్‌లు ఏమీ చేయించుకోలేదు. మావారు బెంగుళూరులో ఉద్యోగం చేస్తుంటారు. అమ్మకూడా ఉద్యోగి. మావారు వీకెండ్స్‌లో తిరుపతి వచ్చి వెళ్తుండేవారు. నాకు రెండు కోర్కెలు. ఒకటి – అమ్మ, మావారు నా దగ్గర ఉండగా నాకు డెలివరీ కావాలని, రెండవది – డాక్టర్లు ఇచ్చిన డేట్‌కు ఎటువంటి ఇబ్బంది లేకుండా నార్మల్ డెలివరీ కావాలని. సెప్టెంబర్ 16వ తేదీ డాక్టర్లు డేట్ ఇవ్వడంతో నేను 16వ తేదీ తరువాత హాస్పటల్‌లో చేరదామని అనుకున్నాను.

మావారు వీకెండ్ కోసం తిరుపతి వచ్చి ఉన్నారు. నొప్పులు లేకపోయినా 15వ తేదీ ఉదయం నుంచి నాకు ఇబ్బందిగా అనిపించడం మొదలయ్యింది. మావారు తిరుపతిలో ఆగిపోయారు.



అమ్మ రాబోయే ఐదురోజులపాటు సెలవు పెట్టింది. నేను కూడా టిఫిన్ చేసి నా లగేజి ప్యాక్ చేసుకొని ఉదయం గం॥9.30ని॥లకు హాస్పటల్‌లో చేరాను. జూనియర్ డాక్టర్ డెలివరీ చేయడానికి సిద్ధమయ్యింది. మాఅమ్మ నా దిండు క్రింద బాబా చిత్రపటం ఉంచి డెలివరీ రూమ్‌కి పంపింది. డెలివరీ రూమ్‌కు వచ్చిన డాక్టర్ నా పరిస్థితి చూసి అది ఆర్.ఒ.పి. అనే ఒక కండీషన్ అని, బిడ్డ నా కడుపులో ఉన్న స్థితిలో డెలివరీ కావడానికి చాలా నొప్పి, చాలా సమయం వేచి చూడాలని, ఇబ్బంది అయ్యేట్లయితే మూడుగంటలు వేచి చూసి తరువాత సిజేరియన్ చేయాల్సి వస్తుందని చెప్పారు.

బయట అమ్మ, లోపల నేను బాబాను స్మరించుకుంటున్నాం. మావారు గురుదేవులకు నా డెలివరీ గురించి ఇ-మెయిల్ చేసారు. నాకు గం॥12.30ని॥లకు నార్మల్ డెలివరీ అయ్యింది. నేను కోరుకున్నట్లు నాకు పుట్టిన 'ఆడపిల్ల'ను ముద్దాడిన క్షణాల్లోని ఆనందం వ్యక్తం చేయడానికి మాటలు చాలవు. తనే నా అందాల చిన్నారి 'శ్లోక'. ఇప్పుడు తనకు నాలుగు నెలలు. అమ్మపాలు త్రాగుతూ అల్లారుముద్దుగా పెరుగుతోంది. నాకు ఇంతకంటే ఏం కావాలి? నేను డెలివరీ అయిన సాయంత్రమే డిశ్చార్జి అయ్యాను. డాక్టర్‌గారు ఇలా చెప్పారు "డెలివరీ కాబోయే కొన్ని క్షణాల ముందు బిడ్డ 90డిగ్రీలు వంపు తిరడగంతో ఇబ్బంది లేకుండా డెలివరీ జరిగింది." పాప అవసరమైన దానికంటే ఎక్కువగా పెరగకపోవడంతో చక్కగా అంతా జరిగింది. నేను ఇదే సంతోషాన్ని తొమ్మిదవనెల మొదటిరోజున అంటే 'శ్రీమంతం' స్థానే మా ఇంట్లో 'సత్సంగం' జరిగిన రోజున అనుభవించాను. నన్ను శ్రీబాబూజీ మూడు విధాలుగా అనుగ్రహించారు. సాధారణ డెలివరీ కావడంతో నేను నా పనులు చేసుకోగలను. రెండు - శ్లోకకు అవసరమైన అమ్మపాలు చక్కగా అమర్చారు. మూడు - మా అమ్మ జాబ్‌కు ఇబ్బంది లేదు. పైగా మేమిద్దరం చక్కగా ఉన్నామని మా అమ్మకు బహు సంతోషం. అవసరమైనవన్నీ అందించే ఆ సద్గురునాథునికి సప్రేమ సుమాలతో.... - ప్రతిమ

## నామమే రక్షణ - నామిదే ఈ శిక్షణ

గురుబంధువుల్లారా! నేను 2007వ సం॥ గురుపూర్ణిమకు వెళుతుండగా జరిగిన సంఘటనను వివరిస్తాను. గురుబంధువులు వెంకటేశ్వరిగారు, ఎంఎస్ఆర్, భీమిలిరాజుగారు, వారి అబ్బాయి బాలాజీ, భవానీగారు మేమంతా కలిసి దేవగిరి ఎక్స్‌ప్రెస్‌కు సికింద్రాబాద్‌లో బయలుదేరి మన్మాడ్‌లో రాత్రి సుమారు గం॥1.30ని॥లకు దిగాము. అక్కడి నుండి శిరిడీ గంటన్నర ప్రయాణం. మారుతీవ్యాన్‌లో





అందరం బయలుదేరాము. మాతోపాటు ఎంఎస్‌ఆర్‌కు తెలిసిన, విశాఖపట్నం వారు వేరే మారుతీవ్యాన్‌లో శిరిడీకి బయలుదేరారు. వ్యాన్ బయలుదేరిన వెంటనే ఎంఎస్ఆర్ బాబా నామం చెప్పడం ప్రారంభించాడు. అందరమూ నామం చెబుతున్నాము. నేను వ్యాన్‌లో ఫ్రంట్‌సీటులో కూర్చున్నాను. అర్ధరాత్రి అయినప్పటికీ, లారీలతోను, ఇతర వాహనాలతోను రోడ్డు చాలా రద్దీగా ఉంది. మేము ప్రయాణించే వ్యాన్ డ్రైవర్ కొంచెం జోరుగానే నడుపుతున్నాడు. ఒకటి రెండు సార్లు అతనికి సైగ చేస్తూ నెమ్మదిగా వెళ్లమని హెచ్చరించాను. అతడు నడపడం చూసి యాక్సిడెంట్ అవుతుందేమో అని మనసులో అనిపించడంతో అతనిని మరొక్కసారి హెచ్చరించాను. దానికి అతను తగ్గినట్లే తగ్గి మళ్లీ మామూలుగానే వెళుతున్నాడు. నేను బాబాకు, గురువుగారికి జై చెప్పుకుని బాబా నామం చెప్పడంలో లీనమయ్యాను. నా తరువాత భీమిలి రాజుగారు నామం చెబుతున్నారు. కొద్దిసేపటికి మేము ప్రయాణిస్తున్న వ్యాన్ లారీని క్రాస్ చేస్తూ, రోడ్డు ప్రక్కన ఉంచబడిన పెద్దరాయిని, గమనించకుండా గుద్దడం, పెద్ద శబ్దం రావడం, కుడివైపుకు ఈడ్చుకుంటూ వెళ్లి చిన్నపాటి కాలువ (బురదతోకూడిన) ఒడ్డున వాలుగా నిలబడిపోవడం ఒక్కసారిగా జరిగింది. అది ఎంత వాలుగా నిలబడింది అంటే ఒక్క జానెడు ముందుకు వెళ్లి ఉంటే తప్పనిసరిగా కాలువలోకి బోల్తా పడి ఉండేది. అదే సమయంలో ఎదురుగా ఏదైనా వాహనం వచ్చి ఉంటే పరిస్థితిని ఊహించలేము. ఆశ్చర్యం.... ఇంత జరుగుతున్నా ఎవ్వరూ కూడా బాబా నామం ఆపలేదు. నామం చెప్పడంలో గాభరాగాని, అరుపులుగాని లేవు. ఆ తరువాత ఒకరికొకరం పలకరించుకుని కారునుండి తాపీగా దిగాము. ఎంఎస్‌ఆర్‌కు ముందు ఉన్న సీటు గుద్దుకొని కొంచెం మోకాలు నొప్పి చేయడం మినహా ఎవ్వరికీ ఏమీ కాలేదు. అప్పటికి సమయం తెల్లవారుఝామున సుమారు మూడున్నర, నాలుగు గంటల సమయం.

మేము ఎవ్వరమూ కూడా డ్రైవర్‌ను ఏమీ అనలేదు. జాగ్రత్తగా వెళ్లకపోవడం వలన ఎంత ఇబ్బంది అయ్యిందో చూసావా అని నేను డ్రైవర్‌తో అన్నాను. ఇది నాకు బాగా అలవాటైన రూట్, రాయి అడ్డు పడడం వలన ఇలా జరిగింది అని చెప్పాడు. అక్కడికి శిరిడీ సుమారు 30 కిలోమీటర్ల దూరం ఉంది. ఈ సంఘటన నుండి మేము బయట పడడం సామాన్య విషయం కాదు. కేవలం బాబా అనుగ్రహం వల్లనే మేము కాపాడబడ్డాము. ఈ సంఘటన సమయంలో నేను ఏ మాత్రం అయోమయానికి గురికాకపోవడం, ఏ మాత్రం భయపడకుండా నిబ్బరంగా ఉండడం గురువుగారు నాకు కల్పించిన ధైర్యం, అవగాహనల ఫలితమే. ఇది గురువుగారిచే అమోఘంగా ప్రసాదించబడ్డ

**మహాత్ముల స్వరూపం సదా ఆనంద దీపికలు వెలిగిస్తూ ఉంటుంది.**



సత్సంగాల వల్ల మాత్రమే సాధ్యపడింది. మామూలు పరిస్థితులలో అయితే గాభరా పడడం, భయపడడం, శిరిడీ వెళ్తుంటే ఇలా జరిగిందేమిటి అనిపించేదే! సత్సంగంలో నేను ఎన్నోసార్లు విన్న మాటలు గుర్తుకు వచ్చాయి. అవి.... మీరు శిరిడీకి ప్రయాణమైనప్పటి నుండి మళ్లీ ఇంటికి వచ్చే వరకు గమనించుకోండి. మిమ్ములను బాబా ఏ విధంగా తీసుకెళ్లి మళ్లీ మిమ్ములను ఎట్లా ఇంటికి చేరుస్తారో అని... ఆ తరువాత అటువైపు, ఇటువైపు చాలా వాహనాలు ఆగిపోయాయి. అందరి సహకారంతో వ్యానుకు తాళ్లు కట్టి, వ్యాను బోల్తా పడకుండా చేతులతో ఆపుతూ, మేమందరం కూడా సాయంపట్టి రోడ్డు మీదికి నెట్టాము. టైరు పగిలిపోయింది, డిస్క్ వంగిపోయింది. రోరింగ్‌ఆమ్ విరిగింది. డ్రైవర్లంతా వేరే వ్యానును శిరిడీ నుండి రప్పించి, మమ్ములను శిరిడీకి చేర్చారు. బాబా ప్రణాళిక ఏమంటే రెండు గంటలు ముందు వర్షం కురిపించి రోడ్డును మరియు ప్రక్కన ఉన్న మట్టిని తడిగా ఉంచారు. దాంతో మా వ్యాను మట్టిలో కూరుకుపోయింది. లేనిచో బోల్తా పడితే అందరం గాయాలపాలయ్యేవాళ్లం. అప్పటికి సమయం ఉదయం ఆరు గంటలు.

ధూళి దర్శనంలో బాబాకు, సాయియానాలో గురువుగారికి కృతజ్ఞతలు చెప్పుకున్నాను. ఈ గురుపౌర్ణమి యాత్రలో శిరిడీలో ఉన్నది మూడు రోజులే అయినా గతంలో ఎప్పుడూ లేని విధంగా ఆరుసార్లు గురువుగారిని దర్శించుకున్నాను. నాకు కలిగిన ఆనందం ఎంతని చెప్పను? వారి దర్శనాన్ని ఏమని వర్ణించను? ఎల్లప్పుడూ గుర్తుకు తెచ్చుకొని ఆనందిస్తూ ఉంటాను. అనుగ్రహం ఎల్లప్పుడూ వర్షిస్తూనే ఉన్నది. దానిని గుర్తించడమే చేయవలసినది. **–రవీంద్రనాథ్**

## దర్శనము - మార్గ దర్శనము

పూజ్య గురుదేవులు శ్రీ సాయినాథుని శరత్ బాబూజీ పాదపద్మములకు నమస్కారము తెలుపుకుంటూ నా అనుభవాన్ని గురుబంధువులతో పంచుకుంటున్నాను. నేను కొందరు స్నేహితులతో మే 26, 2006వ సం॥లో బాబా దర్శనార్థం శిరిడీకి వెళ్లాను. బాబా దర్శనం చేసుకుని వచ్చిన తరువాత నాతో వచ్చిన స్నేహితులు సాయియానా దగ్గర కనిపించారు. అప్పుడు నేను గురువుగారి ఫొటో చూసాను. మే 27వ తేదీ గురువుగారు దర్శనమిచ్చారు. గురువుగారు సాయిపథంలో ఉన్నంతసేపు మాకు ఎంతో ప్రశాంతత కలిగింది. గురువుగారు దర్శనం ఇచ్చి వెళ్లిపోతున్న సమయంలో గురువుగారు మా దగ్గరకు వచ్చేసరికి నాకు తెలియకుండా కన్నీళ్లతో గురువుగారి పాదాలు పట్టుకుని నా భర్తకి ఆరోగ్యాన్ని ప్రసాదించండి అని కోరుకున్నాను. దానికి గురువుగారు చిరునవ్వుతో,



## గురునామాన్ని జపించడం వలన పరమానందం కలుగుతుంది.

చల్లనిచూపుతో సమాధానం ఇచ్చారు. రెండురోజులు గురువుగారి దర్శనం పొందాను. నేను శిరిడీ నుండి తిరుగు ప్రయాణంలో గురుబంధువులను "మీరు సత్సంగం జరుపుకుంటున్నారా? గురువుగారిని ఎలా పూజిస్తున్నారని ప్రశ్నించాను? సత్సంగం అంటే ఏమిటి? దానిని ఎలా చేసుకోవాలని" నాతో వచ్చిన స్నేహితుల్ని అడిగాను. వాళ్లు చెప్పారు. కాని నాకు గురువుగారిని, బాబాని ఎలా పూజించాలో అర్థమవ్వలేదు. ఇంటికి వచ్చిన తరువాత అనేక సమస్యలు వచ్చినపుడల్లా బాబా, గురువుగారి ఫోటో దగ్గర నాకు సత్సంగం జరుపుకోవాలని ఉంది అని చెప్పుకునేదానిని. కొందరు గురుబంధువుల సహాయంతో మేజర్ సురేష్‌బాబు గారి ద్వారా అక్టోబర్ 7వ తేదీన మా ఇంట్లో సత్సంగం ప్రారంభమైనది. అదే విధంగా సురేష్‌బాబుగారి సహాయంతో సత్సంగాలు జరిగినవి. మాకు తెలియని గురువుగారి గురించి ఎన్నో విషయాలు చెప్పారు. గురువుగారికి మమ్మల్ని దగ్గర చేసారు. ఎన్నో సమస్యలకు పరిష్కారం దొరికింది. ఎన్నో కష్టాలు వచ్చినా గురువుగారి దయవల్ల సంతోషంగా ఉన్నాము. తరువాత నా భర్త ఆరోగ్యం మళ్లీ దెబ్బతిన్నది. మే 27, 2007వ సం॥లో మరలా శిరిడీకి ప్రయాణమయ్యాను. నా భర్త రిపోర్ట్స్ తీసుకుని బాబా దర్శనం చేసుకొని సాయియానాలో నరేంద్రన్నకు చూపించాను. చూపించి గురువుగారికి చెప్పమన్నాను. నరేంద్రన్న మరుసటిరోజు కంగారుపడవద్దు, గురువుగారు చూసుకుంటారని చెప్పారు. నాభర్త ఆరోగ్యం బాగుంటేనే, ఆయన వ్యవసాయం చేస్తేనే మా కుటుంబ పరిస్థితి బాగుంటుందని నరేంద్రన్నకు చెప్పాను. ఆయన ఏమీ భయపడవద్దు, అన్నీ గురువుగారు చూసుకుంటారని చెప్పారు. నేను ఇంటికి వచ్చేటప్పటికి నా భర్త ఆయన ఆరోగ్యం బాగా ఉందని చెప్పారు. ఆరోజు నుండి మా కుటుంబంలో ఎన్ని సమస్యలు వచ్చినా బాబా, గురువుగారి ఫోటో వద్ద ఊదీ పెట్టుకుని వారితో చెప్పుకున్నాక వెంటనే ఆ ఇబ్బందులు తొలగిపోతున్నాయి. అలా నా కుమారుల ఆరోగ్య విషయంలో కూడా నాకు గురువుగారు తన అనుగ్రహాన్ని ప్రసాదించారు. 2008 గురుపౌర్ణమి రోజు నా భర్తతో నేను శిరిడీ వెళ్లాను. గురువుగారి దర్శనం పొందిననాటి నుండి మా కుటుంబం సంతోషంగా ఉంది. మా ఆర్థిక ఇబ్బందులు తొలగిపోయాయి. నా భర్త ఆరోగ్యం బాగుంది. నా కుటుంబంపై గురువుగారు తన చల్లనిచూపుల దయతో ఇంత ప్రేమ చూపి నా కుటుంబ సమస్యలను పరిష్కరిస్తూ మాకు ఒక మార్గదర్శి అయిన గురువుగారికి నా కృతజ్ఞతలు తెలుపుతున్నాను. – ప్రసన్న



# అయాచితంగా లభించేదే - అనుగ్రహం

నా పేరు శ్రీనివాసరావు. మాది ఏ ఊరో చెప్పాలంటే సందిగ్ధం. ప్రస్తుతం మాత్రం హైదరాబాద్‌లో ఉన్నాను. నేనంటే శ్రీబాబూజీకి చాలా ప్రేమ. నేను రెండు సంవత్సరాల క్రితం వరకు వైజాగ్‌లో ఉండేవాడిని. మెడికల్ రిప్రజంటేటివ్ ఉద్యోగం. నెల చివరలో డబ్బులు వెతుక్కునేంత జీతం, ఎప్పుడూ సంతోషం. ఎలా అంటారా? కొన్ని సత్సంగాలు, సాయినామ సంకీర్తనలు, వార్షికోత్సవాలు, చిన్నారులతో కబుర్లు – ఇలా ఒక ఆరు సంవత్సరాలు. ఇంతలో నాకు ఒక మందులేని రోగమొచ్చింది. ఆ రోగం పేరు 'డబ్బు సంపాదన'. నా వయసులో ఉన్నవాళ్లు ఎంత సంపాదిస్తున్నారు, ఎలా ఉన్నారు, నేను ఎలా ఉన్నానని ఒక పోలిక. సత్సంగానికి వెళ్లడానికి నాకు ఒక మిష కావాలి ఆ రోజుల్లో. సత్సంగానికి వెళ్లకుండా ఉండడానికి మిష కావాలి నాకిప్పుడు. నేను ఉద్యోగరీత్యా ఆంధ్రప్రదేశ్ మొత్తం తిరుగుతాను. తృప్తిగా మూడు గంటలు పడుకుంటే చాలా ఆశ్చర్యంగా ఉంటుంది ఇప్పుడు. రోజుకు 8 గం॥లు పడుకునేవాడిని విశాఖలో. నిద్రలో కూడా ఇంకా ఇంకా సేల్స్ ఎలా చేయాలి? కంపెనీలో ఇంకా ఎలా పేరు తెచ్చుకోవాలి ఇదే ఆలోచన. రోజు మొదలయ్యేది శ్రీబాబూజీకి మొక్కుబడి నమస్కారంతో. బిడ్డ ఎలా ఉన్నా, ఆయన ప్రేమలో మాత్రం మార్పులేదు. వెన్నంటి ఉండే వారి అనుగ్రహమే నాకు రక్షణ, జరిగే సంఘటనలే అందుకు సాక్షి అని తెలుస్తుంది. నేను ప్రమోట్ చేసే మెడిసిన్‌రీత్యా చాలా తక్కువ మంది పేషెంట్స్ ఈ మెడిసిన్ వాడగలరు. ఒక పేషెంట్ అంటే కంపెనీకి 5 నుండి 10 లక్షల రూపాయల విలువ. కనుక పేషెంట్ అంటే చాలా ముఖ్యం. ఒకరోజు వర్క్‌లో భాగంగా చెన్నై ఎక్స్‌ప్రెస్‌లో తెనాలి బయలుదేరాను హైదరాబాద్ నుండి. బయలుదేరిన అరగంటకు ఫోన్ వచ్చింది ఒక పేరున్న డాక్టర్‌గారి దగ్గరనుండి. పోలీస్ శాఖలో పెద్దపేరున్న ఆఫీసర్‌గారి బంధువులకు మెడిసిన్ అవసరం ఉందని. నాకు వాళ్ల నెంబర్ ఇచ్చారు. వాళ్లకు ఫోన్ చేస్తే మేము రెండు రోజుల్లో ట్రిప్‌కు వెళ్లిపోవాలి గనుక మీరు తరువాత స్టేషన్‌లో దిగి వెనక్కు రావడం మంచిదని చెప్పారు. ట్రెయిన్‌లో విచారిస్తే తరువాత స్టేషన్‌కు ఇంకా గంట పడుతుందని తెలిసింది. ట్రెయిన్ ఘట్‌కేసర్ దాటిందని నా ఊహ.

ఆలోచిస్తున్నంతలో ఎదురుగా ఒక ట్రైన్ మెల్లగా వెళుతోంది. గమనిస్తే అది విశాఖ నుండి వస్తున్న జన్మభూమి ఎక్స్‌ప్రెస్. క్రాసింగ్ ఉండడంతో రెండు ట్రెయిన్స్ మెల్లగా వెళుతున్నాయి. నాకు ఏమయిందో, తెలివితక్కువగానో లేక.... కదులుతున్న చెన్నై ఎక్స్‌ప్రెస్ నుండి 15 కేజీల బరువున్న సూట్‌కేస్, 5 కేజీల ల్యాప్‌టాప్ బ్యాగ్‌తో క్రిందికి దిగి అప్పుడే ఆగిన 'జన్మభూమి' లోనికి మారదామని





ట్రాక్ వెంబడి పరుగెత్తాను. కనీసం 750మీ॥ల దూరంలో ఉంది జన్మభూమి ఎక్స్‌ప్రెస్ చివరిబోగీ. నేను నా ట్రెయిన్ దిగిన తరువాత అది వెళ్లిపోతే? అన్న ఆలోచన రాలేదు. ఎట్టకేలకు జన్మభూమి చివరి బోగీ చేరాను. అలుపుకు శరీరం పైకి ఎక్కడానికి సహకరించలేదు. ప్రయాణీకులు చూసి లగేజీ పైకి ఎక్కించారు. ఎక్కిన మరునిమిషం ట్రెయిన్ బయలుదేరింది. అలుపు తగ్గడానికి 20ని॥లు పట్టింది. ఇదంతా ఒక ఎత్తు, అసలు విషయం ఏమిటంటే అప్పటికే చీకటి పడింది. ట్రెయిన్ కొంత దూరం వెళ్లాక అర్థమయ్యింది. సుమారు 7 కి॥మీ॥ దూరం వరకు కనీసం ట్రాక్ చుట్టు ప్రక్కల రోడ్డుకాని, లైట్ కాని లేదని. ట్రెయిన్ మిస్ అయితే నా పరిస్థితి ఏమిటి? చిన్నమాట... త్యాగరాజు ఇలా రచించాడు "మాకేలరా విచారము....మముగన్న శ్రీరామచంద్ర..." నేను ఎలా ఉన్నా, ఆయన ప్రేమ... అందుకే అన్నారు "అయాచితంగా లభించేదే అనుగ్రహమని" **– శ్రీనివాసరావు**

## సత్సంగమే - సమాధానం

బాబా, గురువుగార్లకు నా నమస్కారములు, నా పేరు సాదమ్మ. మాది ఋషికొండ గ్రామము. మాకు పెళ్లి అయిన తరువాత 6 సంవత్సరములు వరకు పిల్లలు లేరు. మా ఇంట్లో పరిస్థితి కూడా బాగుండేది కాదు. చాలామంది నన్ను బాబా–గురువుగార్ల సత్సంగము వెంకటరావు వాళ్ల ఇంట్లో ఉంది, వెళ్లమని చెప్పేవారు. తరువాత కొన్నాళ్లకు సత్సంగమునకు వెళ్లడం మొదలుపెట్టాను. నాకు చాలా మంచి జరిగింది. నాకు జరిగిన అనుభవములు మీతో పంచుకుంటున్నాను.

నేను మొదట్లో చాలా హాస్పటల్స్‌కు వెళ్లాను. చాలా డబ్బు ఖర్చు అయ్యింది. అయినా ప్రయోజనం లేదు. బాబా–గురువుగారిని నమ్ముకున్న తరువాత మంగగారు (వెంకటరావుగారి భార్య) నాతో ఈ విధంగా చెప్పారు. నువ్వు ఎన్ని హాస్పిటల్స్‌కు తిరిగినా ఎంత డబ్బు ఖర్చుపెట్టినా బాబా అనుగ్రహం లేనిది సంతానం కలగదని చెప్పింది. అప్పటి నుండి నేను గురువుగారిని నమ్ముకుని నాకు పిల్లలు కలిగేలా చూడమని వేడుకున్నాను. రెండు సంవత్సరాలు తరువాత నాకు మగపిల్లాడు జన్మించాడు. కాని కొడుకు పుట్టాడని మేము సంతోషిస్తే బిడ్డకు కాళ్లు, పాదములు తిరిగిపోయి ఉన్నాయి. అవి కూడా గురువుగారికి చెప్పుకున్న తరువాత స్థిరపడ్డాయి. ఇపుడు బాబుకు మూడు సంవత్సరాలు,



తరువాత పాపకు 8 నెలలు నిండాయి. నా భర్త మొదట్లో పిల్లలు లేరని మందు బాగా త్రాగేవారు, మేము బాబా-గురువుగారిని నమ్ముకున్న తరువాత పూర్తిగా మందు త్రాగడం మానేసారు. ఇలా ఒకటని కాదు, బాబా-గురువుగారు నాకు చాలా చేసారు. - సాదమ్మ

## సంత్‌పథంలో - నామ జగం

దైవం యొక్క 'భావన' ఈ జగత్తులో 'రూపం'గా భాసిల్లుతోంది. 'రూపం'గా భాసిల్లే జీవులకు దైవమే ఒక 'భాష'ను, తద్వారా ఆ రూపానికి ఒక 'వాచకాన్ని' ప్రసాదించాడు. నామం - జీవికి, పదార్థానికి, గోచరమైనదానికి, అగోచరమైనదానికి.... ఇలా దేనికైనా మనకర్థమయ్యేట్లు ఒక 'పేరు'. రాముడు, కృష్ణుడు... ఇలా ఒక నామవాచకం, వినగానే మస్తిష్కంలో మనకొక రూపం. ఇంతవరకూ బాగానే ఉంది. 'నామం' లేని జగత్తు - ఒక్కసారి ఊహించుకుందాం. ఏదో ఒక వెలితి, 'శూన్యం'గా తోస్తోంది కదూ! జీవి యొక్క 'ఉనికి'ని తెలిపే 'కిటుకు' నామంలో ఉందంటే అతిశయోక్తి కాదేమో!

ఒక్కసారి ఆలోచిస్తే మనం 'సాయిబాబా' అనుకోగానే మన స్మృతిలో శ్రీసాయిరూపం తక్కున దర్శనమిస్తోంది. నామం అనుకోగానే రూపం గుర్తొస్తోంది. అక్కడే తెలుస్తోంది 'నామానికి', 'నామి'కి (రూపానికి) బేధం లేదని. అయితే 'సద్గురు నామం' స్మరించినంతసేపు ఆయన రూపం మన స్మృతిపథంలో సాగుతోందా? సందేహం. పెదాల కదలికకే పరిమితమైతే కుదరకపోవచ్చునేమోగాని 'గుండె లోతుల' నుంచి పిలుపులకైతే ఆ 'ఆనంద స్వరూపం' చెంతనే మనం ఉన్నామనిపిస్తుంది. శ్రీరామకృష్ణులు ఇలా చెప్పేవారు "గంజాయి అనే మాటను పలుమార్లు కేవలం ఉచ్ఛరిస్తే మత్తు కలుగుతుందా? గంజాయి ఆకు తెచ్చి, దాన్ని నూరి నీళ్లలో కలిపి త్రాగాలి. మీరు గృహస్థ జీవితం గడపనున్నారు కనుక మీ మనస్సును భగవచ్ఛింతనతో ఉన్మత్తం గావించుకోండి. మీరు మీ కర్తవ్యాలు నిర్వహిస్తూ ఉండండి. కానీ, ఆహ్లాదకరమైన ఉన్మత్తతను అట్లే నిలుపుకోండి".

గురునామస్మరణ పెదాలకే పరిమితమవుతున్నట్లు అన్పిస్తోంది, మరి ముందుకు సాగడమా, ఆగిపోవడమా అంటే ఇదిగో మహర్షి వ్యాసుడు ఇలా అంటున్నారు "జీర్ణక్రియకు తోడ్పడే పైత్యరస స్రావంలో అస్తవ్యస్థం ఏర్పడినపుడు చక్కెర రుచించదు. కానీ ప్రతిరోజూ అక్కరతో చక్కెర తింటూ ఉంటే క్రమంగా చక్కెర రుచిని అనుభవించవచ్చు - అలాగే భగవన్నామం కూడా!" మహర్షుల మానస పుత్రులు శ్రీబాబూజీ చెప్పినట్లు "ఉన్నతమయిన భావాలను మనకు చేతనయినంత ఆర్తి,





ఆర్ద్రతలతో తిరిగి తిరిగి మననం చేసుకోవడం ద్వారా అట్టి భావము, సంస్కారము క్రమంగా మనలోనూ హృదయగతమవుతుంది". మహాత్ముల మాటల్లోనే చూస్తే "నామస్మరణ – మనిషికి భరోసా ఇస్తుంది, మంచి సమయాల్లో ఆనందాన్ని కలుగచేస్తుంది. రోగానికి ఔషధంగా, చీకటికి వెలుగుగా నామం విరాజిల్లుతోంది. సంఘర్షణ కాలంలో ప్రశాంతతను, ధ్యాన సమయంలో ఏకాగ్రతను ప్రసాదించేది నామస్మరణ మాత్రమే" అంటారు స్వామి వాసుదేవానంద. పదానికి, దాని అర్థానికి ఎప్పుడూ సంబంధం ఉంటుంది. కాబట్టి నామాన్ని, ఆ నామధారిని విడదీయలేము. నామం నామధారిని దృష్టికి గోచరం చేస్తుంది. 'ఆనందస్వరూపుని' నామామృతాన్ని గ్రోలిన జీవుల భావాలు అత్యంత ఆసక్తిగా ఉంటాయి. రూపగోస్వామి తన 'విదగ్ధ మాధవ్'లో ఇలా అంటారు. "ఆ రెండు అక్షరాల కృష్ణ అనే పదంలో ఎంత అమృతం ఉందో నాకు తెలియదు. ఒక్క నోటితో ఆయన నామాన్ని జపించడంలో నాకు తృప్తి లేదు. నాకు లక్ష నోళ్లు ఉండాలని కోరుకుంటున్నాను. ఆయన నామాన్ని ఆలకించడానికి నాకు లక్ష చెవులు ఉండాలి"

గురునామస్మరణకు సంబంధించి తులసీదాస్ ఇలా వచించారు. "గడపవద్ద ఉంచిన దీపం గదిలోపల, బయట వెలుగును ప్రసరిస్తుంది. అదేవిధంగా గురునామజపం మన బాహ్యాంతరాలను ప్రకాశవంతం చేస్తుంది". వైష్ణవ శాస్త్రాలు మాత్రం నామమే ధర్మమని నొక్కి వక్కాణిస్తాయి. విశ్వాసంతో చేసే భగవన్నామాన్ని మించిన ఉత్కృష్ఠ ధర్మం మరేదీ లేదంటాయి. చైతన్యులు ఇలా చెప్పారు."జీవే దయ నామే రుచి వైష్ణవ్ సేవన్, ఇహ విన ధర్మ నైఘున సనాతన్" – ఓ సనాతనా! విను భూతదయను అలవరుచుకోవడం, భగవన్నామం పట్ల భక్తి – భక్తుల సేవ కన్నా ఉత్కృష్ఠమైన ధర్మం ఏదీ లేదు. శ్రీరామకృష్ణులు ఇంకా ఇలా అంటారు. "మనస్సును పవిత్రీకరించడం కోసం విశ్వాసంతో నిరంతరాయంగా భగవన్నామాన్ని జపించాలి. భగవన్నామంలో అనంతమైన మహిమ ఉంది. నామమే బీజం. నామమే చెట్టు. నామమే పండు. భగవంతుడు తన నామంలోనే నెలకొని ఉంటాడు". నారదమహర్షి చెప్పే భక్తి మార్గమయితే "భగవన్నామ జపం, భగవన్నామ గానం, భగవన్నామ శ్రవణం". ఏకనాథుడు ఒక అడుగు ముందుకేసి ఇలా అంటాడు "భగవన్నామస్మరణ మాత్రమే భక్తి" తుకారామ్ మాటల్లో "దైవాన్ని చేరే ఏకైక మార్గం నామస్మరణ మాత్రమే" అందుకే సర్వమత సారాన్ని, సకలసంత్ మార్గాన్నే తన పథంగా అనుగ్రహించిన సాయి అన్నారు "దేవుని నామం ఉచ్ఛరించు" అని.



# పరమాచార్యుని నోట - గురుని మాట

ఎవరో కొందరే ఒక్క గురువును స్వీకరించి అతనియందు ఈశ్వరభావముంచి, అచంచల విశ్వాసంతో, అతనిలో సర్వదేవతా సాన్నిధ్యాన్ని చూడగలరు. ఏకనిష్ఠతో ఆ గురువునే ఆశ్రయించి, ఆయన పాదాలనే నమ్ముకొని వుండగలవారు చాలా తక్కువ. గురుస్వరూపం ధ్యానానికి ఆలంబనగా ఉంటుంది. ఆ రూపం గురువు రూపమా, ఈశ్వరుని రూపమా? ఇచ్చట నేను గురుభక్తి ఈశ్వరుని భక్తి కంటే పై స్థాయిలో ఉండాలని అంటున్నాను.

మీరు అడగవచ్చు. ఈశ్వరుడ్ని అర్చించడానికి బదులు, ఒక మానవుణ్ణి గురువుగా స్వీకరించి అతనిని ఈశ్వరుడిగా భావించి భక్తి చేయడం సాధ్యమా అని. ఈశ్వరుడు ప్రపంచాన్ని సృష్టించి పరిపాలించవచ్చు. అతడు ఈ లోకాన్ని సంహరించనూ వచ్చును. మనకా గొడవ ఎందుకు? ఆ పరమశక్తి గల ఈశ్వరుని వద్ద నీవు కోరేదేమి? ఈ సంసారంలో చిక్కుకొని అలమటిస్తున్న నీకు తాపత్రయాలు పోగొట్టి అనుకంప చూపగల కృపాలేశమే కావలసినది. నీకు కావలసినదల్లా ముక్తి. ఈ ప్రపంచపు సమస్య ఈశ్వరునిది. ఆయన బాధ ఆయన పడతాడు. ఈ ప్రపంచం మాయా? లీలా? ఈ సృష్టి అంటే ఏమి అనే విచికిత్స నీకక్కరలేదు. ఆ విచారమంతా ఈశ్వరుడు పడనీ, ఈ సంసార పంకంలో చిక్కుకొని అలమటించే నీకు విమోచన ఇవ్వడానికి గురువు ఒక్కడు చాలు. ఆయన చేసే జ్ఞానబోధతో నీకు వాస్తవమేమో బోధపడుతుంది. ఈ సంసారాన్ని తరించడానికి కావలసిన నావ గురువే కాని ఈ ప్రపంచాన్ని సృష్టించిన ఈశ్వరుడు కాదు.

సరి! గురువు జ్ఞానదాత కావచ్చు. కానీ ఆ గురువుకు జ్ఞానం ఎవరిచ్చారు? ఈశ్వరుడు కాదా? వీనికి జ్ఞానమివ్వాలి అని గురువుకు అనుకంప కలిగితే దానికి మూలము ఈశ్వరుడే కదా? అని మీరు అడగవచ్చు. అది వుండనీ, ఈశ్వరుడు కృపాసముద్రమే కావచ్చు. ఆయన జ్ఞానార్ణవంగానే వుండనీ, నీ మాలిన్యాన్ని పోగొట్టడానికి ఆ సముద్రం అవసరమేమి? నీకు దాపులో వుండే బావి నీరో, కొళాయి నీరో చాలదా? నిన్ను ఉద్ధరించడానికి వచ్చిన గురువు ఆ సముద్రంలో నుంచి వచ్చిన తరంగమే అయినా నీ ఆధ్యాత్మిక తృష్ణ తీర్చడానికి, నిన్ను ఉద్ధరించడానికి ఆయన చాలు. ఆయన నీకు ముక్తి ఇచ్చేందుకు సమర్థుడు.

ఒక ధనికుడున్నాడు. ఆయన పదివేల మందిని పిలిచి సంతర్పణ చేస్తాడు. ఆయన మహానసంలో (వంటిల్లు) వున్న పదార్థాలన్నీ నీవు తినగలవా? నీకు కావలసినది నీ ఆకులో వడ్డించినది మాత్రమే. నీకు ఆ ధనికుడు ఎవరో కూడా తెలియవలసిన అవసరం లేదు. నీకు వడ్డించేవాని ఆసరా ఉంటే





చాలు. గురువు విషయము కూడా అంతే. గురువు నీకు ఉపదేశం చేసే హక్కు తనకు ఉన్నదని ఎన్నడూ అనుకోడు. ఈశ్వరుడే అతనికి ఆ అధికారం ఇచ్చాడు. అందుచేత ఈశ్వరుని అనుగ్రహం మనకు గురువుద్వారా లభిస్తుంది. అట్టి గురువును ఆశ్రయించి శిష్యుడు నిశ్శ్రేయసం పొందాలనే ఈశ్వరుని వాంఛ. ఈశ్వరుణ్ణి మనమెవరూ చూసినది లేదు. మహాత్ములు వర్ణనల వలన ఈశ్వర స్వరూపాన్ని మనం ఊహించగలుగుతున్నాం. గురువట్లా కాదు. ఆయనను మనం మన కళ్లతో చూస్తున్నాం. ఆయనతో సంపర్క సల్లాపాలకు ప్రత్యక్షంగా అవకాశం ఉంది. మనం ఈశ్వరుని వద్ద కోరే కర్మక్షయమూ, జ్ఞానలబ్ధీ రెండూ మన గురువు మనకు ప్రసాదించగలడు. పోగా ఈశ్వరుని మనమెంతమంది సూటిగా ప్రార్థించగలం? గురువు అట్లు కాదు. అతడు ఈశ్వర చైతన్యం కలవాడు. ఆయన మన తరపున ప్రార్థిస్తే ఈశ్వరుడు ఆ ప్రార్థనలనాలకించి మనకు వలసిన సదుపాయాన్ని తప్పక అనుగ్రహిస్తాడు. రెండవది – మన కర్మ భారమును తగ్గించడమో తొలగించడమో అంత సులభమైన కార్యం కాదు. గురువు తన తపశ్చర్య చేత రక్షకుడుగా ఉంటాడు. మన కర్మను తానే స్వీకరించి మనకు సహాయం చేద్దామన్న ఔదార్యం, కరుణ గురువుకు ఉంటుంది. గురువుకు ఈశ్వరుని యందున్న చనువు చేత – "ఇదిగో – నా శిష్యుడు కష్టపడుతుంటే నేను చూడలేకున్నాను. నీవేదైనా అతని విషయంలో పరిష్కారం చేయి" – అని భగవంతుణ్ణి గురువు బెదిరించగలడు కూడా. "ఏం! నీవు చేస్తావా? లేదా?" అని గురువు అడిగేసరికి, ఈశ్వరుడు 'సరే!' అని చెప్పక తప్పదు!

–'సనాతన ధర్మము' నుంచి గ్రహించబడినది. **కంచి పరమాచార్య శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామివారిచే విరచితం**

## సద్గుణాలతో శీల నిర్మాణం

ఒక ప్రఖ్యాత శిల్పి అందమైన శిల్పాన్ని చెక్కాడు. ఆయన స్నేహితుడు ఆ అద్భుతమైన శిల్పాన్ని చూసి ఆశ్చర్యచకితుడై ఆ శిల్పితో నీవు ఎంత అద్భుతమైన శిల్పాన్ని మలిచావన్నాడు. దానికి శిల్పి సమాధానం చెబుతూ నేను చేసింది ఏమీ లేదు. నాకు పనికిరానిది రాయి నుంచి తీసిపడేశాను అంతే. శిల్పం ఆ రాయిలో గర్భితంగా ఉంది అన్నాడు. క్రమశిక్షణ, నిజాయితీ, దయ, పరోపకారత, పట్టుదల, అంకితభావం, సహనం, పవిత్రత మొదలైన లక్షణాలు మనలో ఉన్నాయి. ఏ విధంగా అయితే శిల్పి తనకు పనికిరానిది తీసివేశాడో అదే విధంగా మనలో ఉన్న చెడులక్షణాలు తీసివేసినప్పుడే మనం శీలవంతులం కాగలం. మంచి పనుల ద్వారా, మంచి ఆలోచనల ద్వారా, మంచి అలవాట్ల ద్వారా మంచి సంస్కారాలను కనుక తయారు చేసుకోగలిగితే మనం శీలవంతులుగా మారతాం.

– స్వామి రఘునాయకానంద

"'నన్ను ఆనంద స్వరూపంగా ధ్యానించు!
అది సాధ్యపడకపోతే నా యీ రూపాన్ని ధ్యానించు'
అన్నది శ్రీసాయి ఉపదేశం.

జగత్తులోని అన్ని రూపాలు ధరించిన తత్త్వం
తానే అని అనుభవపూర్వకంగా భక్తులకు
తెలియచేసిన ఆ రూపాతీతుని 'రూపం'
సాయిభక్తుల ధ్యానానికి ధ్యేయం.
ఆనందానుభూతికి ఆలంబనం!"
అంటారు శ్రీ బాబూజీ



గురునామం ప్రసాదించగలదు భోగమూ, యోగమూ
వదలరాదు నీ హృదయం గురుని పదకమలం



కీర్తించాలి నిరంతరం గురునామ వైభవం
గురునామమే ఇహపర శ్రేయోదాయకం